# జలయజ్ఞం

-పి. జి. కె. మూర్తి

"ఒసేవ్ కాంతం! కుళాయి వస్తోంది".

తుపాను తాకిడికి విరిగిపడ్డ బొప్పాయి చెట్టు ఆకుల్ని పెరట్లో ఒక ప్రక్కగా చేరుస్తున్న బుచ్చిరామయ్య కెళ్ళుమని అరిచాడు.

"ఆ...! వచ్చేసిందీ కుళాయ్! అదృష్టమే... అదిగో ఆ ట్యూబ్‌ను తగిలించి తొట్లోకి పడేయండి" అదే స్థాయిలో బదులిచ్చింది వంటగదిలోంచే కాంతం.

"నేను పెరట్లో తుక్కులు తీస్తాను గానీ, నువ్వే ఆ పని చూడు".

"ఏడ్చినట్టుంది! ఇవతల కాఫీ డికాక్షను పొంగి చస్తోంది"

కాంతం గొంతులో కొంచెం విసుగు చోటు చేసుకుంది.

"నీళ్ళు చిలికించు. పొంగు చల్లబడుతుంది" చేతుల్లో వున్న చెత్తను కాంపౌండ్ వాల్ మీది నుండి బయటకు విసురుతూ ఉచిత సలహాను భార్యకు విసిరాడు సుబ్బరామయ్య.

"సలహాలకేం కొదవలేదు" అన్న కాంతం "తొంద రగా పట్టండి" అంది.

"ప్రస్తుతం గాలి మాత్రమే వస్తోంది. నీళ్ళు రావాలి" చేతుల కంటిన మట్టిని దులుపుకుంటూ చెప్పాడు.

"నిన్న రాత్రి డాబా మీద వర్షపు నీటిని పట్టడానికి కుంచిన బకెట్టు పట్రండి ముందు... వర్షపు నీరు పడే వుంటుంది".

"వెడుతున్నా!"

"తుపాను మూలంగా రెండు రోజులుగా కరెంటు లేదని కుళాయిల వాడు నీటి చుక్కను వదల్లేదు... ఇది మాత్రం ఎంతవరకూ ఉంటుందో - ఏమో! వేగం వెళ్ళండి" కాఫీ గ్లాసుతో వచ్చి అందించింది కాంతం.

"ఆసి నీ ఇల్లు అపార్ట్‌మెంట్ గాను. మాట కటువేగాని, మనసు మట్టుకు .......... నీది" మెచ్చుకోలుగా అని, కాఫీ గ్లాసును అందుకున్నాడు బుచ్చిరామయ్య.

"చాల్లెండి! అవసరం తీరే వరకు ఓడమల్లన్న, అవసరం తీరేక బోడి మల్లన్న అనడం అలవాటేగా ఈ నలభై ఏళ్ళ నుండేను".

"ఏదో గరువు మీద ఉన్నాం గనుక గట్టెక్కాం. లేకుంటేనా"

కాఫీ గ్లాసును నోటి కందించుకుంటూ అన్నాడు బుచ్చిరామయ్య.

"మీ ఉపమానాలు కట్టిపెట్టి, ఆ బకెట్టు తెచ్చి నీళ్లు పట్టండి!"

ఒక చేత్తో నడుం పట్టుకుని గుమ్మాన్ని ఆసరాగా చేసుకునిలబడింది కాంతం.

"కాఫీ చుక్కను గొంతు దిగనిస్తావా!" నేత్రాభినయం చేస్తూ కాంతంవంక చూసేడు.

"దిగకేం! భేషుగ్గా దిగుతుంది గ్లాసుడున్నూ! ముందు కదలండి!"

"వెడుతున్నానే!" కదిలాడు గ్లాసు కాంతాని కందించి.

"ఏమిటో! మిన్ను విరిగి మీద పడుతున్నా, అడుగు తీసి అడుగు వేయడే మనిషి" వినీవినపించనట్టుగా అనుకుంటూ.

గోడనున్న ట్యూబును అందుకుని కుళాయి బుర్రకు తగిలించి, కొసను తొట్టిలోకి విడిచి, లోపలికి నడిచింది కాంతం.

"వట్టి నస" అనుకుంటూ మెట్లు ఎక్కాడు బుచ్చిరామయ్య.

"వస్తున్నారా!" ఓపికనంతా కూడదీసుకుని పిలిచింది కాంతం.

"వస్తున్నానే! కాళ్ళకింద నిప్పులు పోయకు!!"

"వేగం రమ్మన్నానని, గబగబా దిగకండి. అసలే మెట్లు వర్షపునీటికి పాకుడు పట్టి వుంటాయ్" అన్న కాంతం "ఏమిటో! చంటి వెధవకి చెప్పినట్టుగా ప్రతీది చెప్పాలి" అనుకుంది.

"ఏమేవ్! నేను మెట్లు ఎక్కుతుంటే ఆ వీధి కుక్క డాబా మీది నుంచి దిగుతోంది. చావబాదినా డాబా ఎక్కడం మానదు కదా! ఖర్మ" వంట గది కిటికీని సమీపించి చెప్పాడు బుచ్చిరామయ్య.

"ఆ ముష్టి కుక్క బకెట్లో నీళ్ళు ముట్టుకుందో ఏంపాడో! ముందా నీళ్ళు వంపి, కడిగి మరీ పట్టండి!".

"నీళ్లు రాక కటకటలాడిపోతుంటే, ఉన్న నీళ్ళని

వంపుకోవడమెందుకే!.... అయినా కుక్క ముట్టిందీ, లేనిదీ చూశామా!"

"కుళాయి వచ్చిందిగా, చెంబుడు నేళ్ళు పోతే కరువు రాదు" విసుక్కుంది కాంతం.

"చుట్టూ నీళ్ళున్నా, త్రాగేందుకు మంచినీళ్ళు లేక ముఖం వాచి పోయాం, రెండు నాళ్ళుగా! నీటిని వృథాగా పారపోయడం నా వల్ల కాదు" ఖచ్చితంగా పలికాడు బుచ్చిరామయ్య.

"అంత వల్లమాలిన పనెందుగ్గాని, ఆ బకెట్టు అక్కడ తగలేసి, బిందెల్లో నీళ్ళు పట్టే పని చూడండి" కస్సుమంది కాంతం.

బిందెలు తీసుకోడానికి వంట్లో అడుగుపెట్టి, అక్కడ వున్న స్టీలు గిన్నెని అందుకున్నాడు బుచ్చిరామయ్య.

"అయ్యో నా రాత. అవి కాచి వడగట్టిన మంచి నీళ్ళండీ! పారపోస్తారా ఏమిటి?" ఆందోళనగా అరిచింది కాంతం.

## వేడుక

ఈ నిశ్శబ్దపు నీలాకాశం
క్రమ్మిన కారు చీకట్లను
చీల్చి చూడాలనిపించి
కన్నార్పకుండా చూస్తున్నా!
ఆకాశపు తారలు మెరిసే కళ్ళలో
చూస్తున్నట్లున్నాయి!
ఎవరా నిర్భాగ్యుడు! నిస్పందేహంగా
వృథా ప్రయాసితుడు.
జీవం లేని రెండు కళ్ళలో
ఎంతో కాంతి నింపుకొని
మా కళ్ళలోకి సూటిగా చూడాలని
తాపత్రయ పడతాడెందుకు?
అంతలో తెల్లని పరదా తప్పుకుంది
ఎక్కడ నుంచీ చందమామ
నవ్వింది తొంగిచూసి! నన్ను చూసి!!
అప్పుడు నాలో నిండిన నవ్యకాంతిని చూసి
తారలు తెల్లబోయాయి!
దిండు ప్రక్క మల్లెలు ఘుమ్మన్నాయి!
వాటి సువాసనలు ఘుమ్మన్నాయి.
వింత కాంతి తప్ప వాసనలేని తారలు
మల్లెల మరులు మాకిమ్మని వేడుకున్నాయి!
నాకెంత వేడుక!!

**-సూరంపూడి విశ్వం**

"అలాగా! ముందుగా చెప్పావ్! లేకపోతే తొట్టిలో పోసేవాణ్ణి".

"మీరంత ఘనులనే, ఓ కంట మీ పనులు చూస్తుంటాను" అతిశయంగా చూసింది.

"అబ్బ! ఆ అతిశయం, నీ ముఖానికి గొప్ప అలంకారంగా వుందేవ్ కాంతం" అంటూ నవ్విన ఆయన నోట్లో ముందువరుసలో వున్న రెండు పళ్ళు తళుక్కున మెరిశాయి.

"బిందెలెక్కడ?"

"బయటకు పదండి. నేనందిస్తాను".

"ఓసి నీ అంటు అటకెక్క!" అంటూ బయట పడ్డాడు బుచ్చిరామయ్య

"ఓసేవ్! కుండీ నిండిపోయింది. తొందరగా రా!"

"ఇవిగో!" బిందెలను అందించి "కాస్తంత తొలిచి మరీపట్టండి" అంటూ గుమ్మానికి చేరబడింది.

బుచ్చిరామయ్య తొట్టిలోంచి ట్యూబును తీసి ప్రక్కకు తిరిగి బిందెలోకి నీరు పట్టబోతుండగా ట్యూబులోంచి విసురుగా వస్తున్న నీరు అక్కడే గుమ్మానికి చేరబడ్డ కాంతం వంటిని తడిపేసింది.

"అయ్యయ్యో! బంగారం లాంటి పొడి చీరను తడిపారు కదండీ!" అసలే బట్టలు ఆరేసేందుకు తికాణా లేకపోయే" విసుక్కుంది కాంతం.

"తడిస్తే ఏమయిందట!? మొక్క మొలవ్వులే!" అన్న బుచ్చిరామయ్య బిందెలోకి ట్యూబును వుంచి, కుళాయి గట్టుకు చేరువగా వున్న సన్నజాజి పందిరిని సరిచేయడంలో నిమగ్నమయ్యాడు.

" ఏమండోయ్! ఎక్కడ తడుముకుంటున్నారు! ఇక్కడ నీళ్ళు గదిలోకి ప్రవహిస్తున్నాయ్!" వంట గదిలోంచి గావుకేక పెట్టింది కాంతం.

ఉలిక్కిపడ్డట్టయిన బుచ్చిరామయ్య పందిరి సంగతి వదిలి ట్యూబును బిందెలోంచి బయటకు తీసి చేతుల కంటిన మట్టిని కడుక్కోసాగాడు.

"అనుకున్నా! మీరిలాంటి ఘనకార్యం ఏదో చేస్తారని" వంటింట్లోంచి వచ్చిన కాంతం చిరుకోపాన్ని ప్రదర్శించింది.

"ఏమయిందిప్పుడు?" అసహనంగా అన్నాడు.

" ఏం కావాలి. మీ చేతుల నున్న మట్టీ, మశానం, బిందెలో పడే వుంటుంది. వాటిని పారబోసి మళ్లీ పట్టండి జాగ్రత్తగా!".

" ఓసి నీ చాదస్తం గూల. చంపేస్తున్నావే! ఒక ప్రక్క నీళ్ళను వృథా చేయద్దని రోజూ 'టి.వి'లో ఏకరు

పెడుతున్నారు కదే! వినలేదూ!" దీర్ఘం తీశాడు బుచ్చిరామయ్య.

"వినకేం. విన్నవన్నీ ఆచరించి చస్తున్నామా!" అన్న కాంతం "ముందా నీళ్ళు వంపండి!" కయ్యిమంది.

"నిక్షేపంలాంటి నీళ్ళను వంపడానికి మనసు అంగీకరించడం లేదే!.... పోనీ బాత్ రూం తొట్టిలో పోస్తాను.. సరేనా!?"

"ఏదోటి తొందరగా కానివ్వండి. ఏ క్షణాన కుళాయి కట్టేస్తారో ఏమో! అసలు కుళాయిల వాడు తిక్కముండావాడు!"

" ఆ భయం లేదు. దండిగా దసరా మామూళ్ళు అందుకున్నాడుగా!" ఏదో గొప్ప విషయాన్ని చెప్పినట్టుగా ఫకాలున నవ్వాడు బుచ్చిరామయ్య.

"నవ్వింది చాలుగాని. ముందు మంచినీళ్ళ సంగతి చూడండి" అంటూ లోపలికి అడుగు పెట్టింది కాంతం.

"నువ్వేం చేస్తున్నావ్! ఆ ట్యూబ్ పట్టుకోవచ్చు గదా!"

"అఘోరించినట్టే వుంది. అవతల స్టౌవ్ మీద ఒక ప్రక్క పాలు మరుగుతున్నాయి. మరో ప్రక్క ఉప్మాకి ఎసరు మసులుతోంది.

"ఊపిరాడక చస్తున్నా" అన్న కాంతం దిక్కుమాలిన యీ నడుమొకటి స్వాధీనంలో లేదాయెను!'' సాగదీసింది కాంతం.

"సరే! సరే! ఆ ఏడుపేదో నేనే ఏడుస్తాను గాని, నువ్వా పనిలో వుండు" అన్న బుచ్చిరామయ్య. ట్యూబును మరో బిందెలోకి పడేసి, నీళ్ళు నిండిన బిందెను బాత్‌రూం వైపునకు పట్టుకు వెళ్ళడానికి, కాస్త ముందుకు వంగి, బిందెను ఎత్తబోయి చిత్తడిగా వున్న నేలమీద అడుగు వేసి, జారి వెల్లకిలా పడ్డాడు.

బిందె కాస్తా శబ్దం చేస్తూ దొర్లిపోయింది.

"ఏమయిందండీ! ఆ చప్పుడేమిటీ!" వంటింటి కిటికీలోంచి తొంగి చూచి "అయ్యో నా రాత. పనివాడు పందిరేస్తే పిచుకలు పడగొట్టాయని ఎంత పని జరిగింది" అన్న కాంతం స్వరం తగ్గించి మెల్లగా లేవండి... నడుం పట్టేసిందో ఏంపాడో! అసలే నడుం పనిచేయక నేను చస్తుంటే, ఇప్పుడు మీరు కూడా..." జాలిగా పలికింది.

"ఆపవే నీ గోల! నాకేం కాలేదు గాని" లేచి బిందెని అందుకున్నాడు బుచ్చిరామయ్య.

"బిందెని శుభ్రంగా కడగండి. మట్టి పట్టినట్టుంది" తన మామూలు ధోరణిలో అంది కాంతం.

"ఓసి నీ గోల గూల. ఇలా కడుక్కోడంతోనే ఉన్న సమయం, పట్టిన నీళ్ళు వృథాగా పోతున్నాయ్!" బాధగా అన్నాడు.

"అలాగే వుంటుంది మరి... అన్నట్టు కడగమన్నానని చెప్పి, మంచి నీళ్ళ బిందెలో చెయ్యి ముంచేరు సుమా!"

"నాకంత మతిమరుపు రాలేదులే!"

"మతిమరుపు మాటెలా వున్నా చెవుడొచ్చిందిగా, ఎదుటి వాళ్ళను కాల్చుకు తినడానికి" సన్నగా గొణుక్కుంది కాంతం.

"బిందెని కడుగుతున్నాను గాని. నీ గొణుగుడు కట్టిపెట్టు".

"అలాగే వుంటుంది. ఆ కాస్త కుళాయి ఆగిపోతే, అలోలక్ష్మణాని వాటర్ టేంకుకు పోవాలి. ఆపై మీ యిష్టం." హెచ్చరికగా అంది కాంతం.

బుచ్చిరామయ్య బిందెని కడుగుతూ, వంటగదిలోంచి వస్తున్న కమ్మనినేతి పోపు వాసనకు ముక్కుపుటాలెగరేస్తూ "ఓసేవ్! కాంతం ఆ ఉప్మాలో జీడిపప్పు దండిగా వెయ్యి!" అన్నాడు ఆసక్తిగా.

"రుచులకేం తక్కువ కాకూడదు. రిటైరయ్యానన్న జ్ఞానం కూడా లేదు మనిషికి". అక్కసుగా అంది కాంతం.

"బిందెలు రెండూ నింపానే!"

"స్టీలు దబరా వుందిగా అది నింపండి!" ఆదేశించింది కాంతం.

"ఏమండోయ్!"

"మళ్ళీ ఏమయిందే బాబు! అలా అరుస్తున్నావ్!"

"నా అరుపులలా వుంచండి! అవతల వీధి గుమ్మంలో మీ కోసం ఆ కుళాయిల ఆసామి అరుస్తున్నాడు. అది చూడండి."

"ఎందుకట?"

" ఏమో నాకేం తెలుసు! వెళ్ళి కనుక్కోండి. అలాగే కుళాయి రోజూ ఇస్తాడో, లేదో అడగండి. ఎందుకైనా మంచిది మరికాసిన్ని నీళ్ళు జాగ్రత్త పడచ్చు" అంది కాంతం సుస్వరంతో.

"ఆసి నీ ఇల్లు అపార్ట్‌మెంట్ కాను. నీకెంత ముందు చూపె" అన్న బుచ్చిరామయ్య 'కస్' మన్న శబ్దం వినిపించడంతో ఆత్రంగా కుళాయివంక చూశాడు.

కుళాయి ఆగిపోయింది.

"జలయజ్ఞం సమాప్తం" అంటూ అక్కడ నుండి కదిలాడు బుచ్చిరామయ్య.

■